నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 24 నవంబర్ 2024 | SANGAREDDY

కేసీఆర్ కనిపించిన సన్నివేశానికి పూలు చల్లుతున్న అభిమానులు

కేసీఆర్ సినిమాకు అపూర్వ ఆదరణ

- సినిమాను వీక్షించిన బీఆర్ఎస్ నాయకులు
- ఈలలు, కేరింతలతో మారుమోగిన థియేటర్

సిద్దిపేట, నవంబర్ 23: జబర్దస్త్ యాక్టర్ రాకింగ్ రాకేశ్ నిర్మించిన కేసీఆర్ సినిమాకు అపూర్వ ఆదరణ లభిస్తుంది. సిద్దిపేట పట్టణంలోని బాలాజీ థియేటర్లో సినిమా చూసేందుకు కేసీఆర్ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు భారీఎత్తున తరలివచ్చారు. సినిమా నడుస్తున్నంత వరకు ఈలలు, కేరింతలతో సినిమా టాకీస్ మారుమోగింది. సినిమాకు సంగీత దర్శకుడు చరణ్‌అర్జున్ అందించిన పాటలు అభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఓ గిరిజన యువకుడు తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు కేసీఆర్ ప్రసంగాలు విని అభిమానిగా మారిపోయే సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి ఎక్కువగా స్పందన లభించింది. చిత్రంలోని కథానాయకుడు రాకేశ్ చెప్పిన డైలాగులు ఆకట్టుకున్నాయి. కేసీఆర్ ప్రసంగం వచ్చినప్పుడు అభిమానులు హంగామా చేశారు.

బాలాజీ థియేటర్‌లో వీక్షించిన బీఆర్ఎస్ నాయకులు

కేసీఆర్ సినిమాను మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సుతో పాటు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, ఎల్లారెడ్డి, పాల సాయిరామ్‌తోపాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి చిత్రాన్ని వీక్షించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రాజనర్సు మాట్లాడుతూ.. సినిమాలో తెలంగాణ యాస, భాషను చక్కగా తెరకెక్కించారని, ప్రత్యేక రాష్ట్రం సాధించిన తర్వాత తెలంగాణ రాష్ట్రం సినిమాలకు చక్కటి వేదిక అయిందన్నారు. సినిమాలో నటించిన నటీనటులందరికీ అభినందనలు తెలియజేశారు.


సినిమా హాలులో జై తెలంగాణ అంటూ నినాదాలు చేస్తున్న అభిమానులు

క్రీడాకారుడిని సన్మానించిన కేసీఆర్

గజ్వేల్, నవంబర్ 23: గజ్వేల్ పట్టణానికి చెందిన ప్రశాంత్ జాతీయస్థాయి క్రికెట్ బీ టీంకు తెలంగాణ నుంచి ఎంపికయ్యాడు. చాలెంజర్ ట్రోఫీ 24లో ఆడుతున్న ప్రశాంత్ శనివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో కలిశాడు. ఈ సందర్భంగా ప్రశాంత్‌ను కేసీఆర్ శాలువాతో సన్మానించి అభినందించారు.

క్రీడాకారుడు ప్రశాంత్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హస్తవ్యస్తం..!

ఉమ్మడి మెదక్ జిల్లాలో గ్రూపు రాజకీయాలు

- పార్టీ, ప్రభుత్వం తీరుపై రగిలిపోతున్న క్యాడర్
- ఏడాది కావస్తున్నా నామినేట్ పదవుల భర్తీ చేయకపోవడంపై ఆగ్రహం
- ఏడాది పాలనపై ప్రజల్లో అసంతృప్తిపై ఆగమాగం
- మంత్రులు పట్టించుకోవడం లేదని ఆవేదన
- రచ్చకెక్కుతున్న విబేధాలు

సిద్దిపేట, నవంబర్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తి నెలకొంది. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా ఇంతవరకు జెండాలు మోసిన నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కలేదు. ఇకెంత కాలం ఓపిక పట్టాలి అంటూ కాంగ్రెస్ అధిష్టానాన్ని నాయకులు ప్రశ్నిస్తున్నారు. పార్టీ తీరుపై లోలోపల రగిలిపోతున్నారు. అంతర్గత సమావేశాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలను ఇంకెప్పుడు మాకు పదవులు ఇస్తారంటూ నిలదీస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రులు తమ అనుచరులకే నామినేటెడ్ పదవులు ఇప్పించుకుంటున్నారు తప్పా, ఇతర నియోజకవర్గాల నాయకుల గురించి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని కాంగ్రెస్ ముఖ్య నాయకులు తమ అనుచరుల వద్ద ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. పదేండ్లు కాంగ్రెస్ జెండాలను మోస్తే కనీసం పార్టీలో గుర్తింపు లేదంటూ నారాజ్ అవుతున్నారు. ఇటీవల ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు ఎందుకు అధికార పార్టీలోకి చేరామా..? చేరి తప్పు చేశామంటూ వారిలో వారు కుమిలి పోతున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీలో కనీసం గుర్తింపు లేదని... కనీసం పార్టీ సమాచారం ఇవ్వడం లేదని... ముందుకు పోనియ్యడం లేదని. ఈ గ్రూపు రాజకీయాలు ఏంటీ అంటూ వారు వాపోతున్నారు. ఏదో సాధిస్తామని కాంగ్రెస్ పార్టీలోకి చేరితే, ఏమి చేయలేక పోతున్నాయని తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. తిరిగి పాత గూటికి చేరాలని కొంత మంది మాజీ ప్రజాప్రతినిధులు, ప్రస్తుత పార్టీ కౌన్సిలర్లు రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకొని నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రధానంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కాంగ్రెస్ పార్టీలోకి పోయిన క్యాడర్ అంతా తిరిగి బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

పదవుల పందేరం లేక...

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా నామినేటెడ్ పదవులు బర్తీ చేయడం లేదు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని మార్కెట్ కమిటీ చైర్మన్లను ఎప్పుడు నియమిస్తారంటూ పార్టీ అధిష్టానాన్ని క్యాడర్ ప్రశ్నిస్తున్నది. జిల్లాలోని దేవాదాయ పాలక మండళ్లతో పాటు ఇటీవల మూడు జిల్లాలకు పట్టణాభివృద్ధి అథారిటీలను ఏర్పాటు చేసింది. ఈ పదవులను పార్టీ సీనియర్ నాయకులు ఆశిస్తున్నారు. పదవుల కోసం ఎవరికి వారే తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు.ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి.(హుస్నాబాద్‌తో కలుపుకొని) ఈ నియోజకవర్గాల్లో ఐదారు మార్కెట్ కమిటీ చైర్మన్లను మాత్రమే నియామకం చేశారు. ఏడాది కావస్తున్నా మిగతా వాటిని ఇంత వరకు నియామకం చేయడం లేదు. సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన అనుచరుడికి ఇప్పించుకున్నారు. సిద్దిపేట,గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల నాయకులకు కాకుండా తన సొంత నియోజకవర్గ నేతకు ఇప్పించుకున్నారు అనే అరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను కూడా తన సొంత నియోజకవర్గ వారికే ఎంపిక చేశారు తప్పా..ఇతర నియోజకవర్గాల్లోని మార్కెట్ కమిటీ చైర్మన్లను ఎందుకు భర్తీ చేయడం లేదని పార్టీ క్యాడర్ ప్రశ్నిస్తున్నారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేట మార్కెట్ చాలా పెద్దది. ఈ మార్కెట్ కమిటీ పాలక వర్గాన్ని ఎప్పుడు నియామకం చేస్తారని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం సిద్దిపేట పార్టీ సీనియర్ నాయకులు పోటీపడుతున్నారు. సిద్దిపేట సుడా చైర్మన్ పదవికి సిద్దిపేట ప్రాంత పార్టీ నాయకులు పలువురు పోటీపడుతున్నారు. ఇటీవల సుడాను సిద్దిపేట జిల్లా మొత్తం విస్తరించడంతో అది కాస్త జిల్లాలోని ఏ నాయకుడికి అయినా ఆ పదవి రావచ్చని అంటున్నారు. సిద్దిపేట వరకు ఉంటే అది సిద్దిపేట నియోజకవర్గ నాయకులకు వచ్చేదని, ఇప్పుడు జిల్లాలోని అన్ని ప్రాంతాల కాంగ్రెస్ నాయకులు పోటీపడుతున్నారు. ఈ పోస్టుకు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరి ప్రవీణ్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తున్నది. మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి జిల్లా కేంద్రం నాయకులకు కాకుండా నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రానికి చెందిన సుహాసినిరెడ్డికి ఇవ్వడంపై అక్కడి కాంగ్రెస్ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మెదక్ ఎమ్మెల్యేను గెలిపిస్తే మాకు ఇదేనా గౌరవం అంటూ మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఎమ్మెలే సంజీవరెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్ మధ్య కోల్డ్‌వార్ నడుస్తున్నది. ఎవరికి వారే సొంతంగా క్యాడర్‌ను తయారు చేసుకుంటున్నారు. ఈ దీంతో నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశం కొలిక్కి రావడం లేదని తెలిసింది. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలో అంతర్గతంగా నాయకులు గ్రూపులుగా విడిపోయారు. పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపులేకుండా పోయిందని క్యాడర్ నారాజ్‌గా ఉంది. కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని పాత క్యాడర్ మంత్రి తీరుపై గుర్రుగా ఉంది. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నీలం మధు, కాటా శ్రీనివాస్ మధ్య సఖ్యత లేదు. ఈ ముగ్గురు ఎవరికి వారే తమ పవర్‌ను చూపించడానికి ప్రయత్నిస్తున్నారు. మొదటి నుంచి పార్టీనే నమ్ముకుని పనిచేస్తున్న తనకు న్యాయం జరగడం లేదని కాటా శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే గూడెం తీరును నిరసిస్తూ ఇటీవల ఆయన పీసీసీ చీఫ్, డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఇక నీలం మధు నేరుగా సీఎం రేవంత్‌తో సంబంధాలు నెరుపుతూ అన్ని విధాలుగా ఎదిగేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఏడాది కాంగ్రెస్ పాలనపై ప్రజలు గుర్రుగా ఉన్నారు, హామీలు ఏమాత్రం అమలు కావడం లేదని ప్రశ్నిస్తున్నారు. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్‌లో నైరాశ్యం నెలకొంది.

చివరి ఆయకట్టు వరకు నీరందించాలి

- కాంగ్రెస్ ఏనాడూ ఇవ్వలేదు
- లేనిపోని హామీలు గుప్పిస్తూ రైతులను నిండా ముంచిన కాంగ్రెస్
- బోనస్ బోగసే... రైతుబంధుకు రాంరాం
- కాంగ్రెస్‌కు రైతుల ఉసురు తప్పదూ...
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఖానాపూర్ (కే)లో విలేకరులతో మాట్లాడుతున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ నాయకులు

కల్హేర్, నవంబర్ 23: గత యాసంగిలో నల్లవాగు ప్రాజెక్టు కింద బీఆర్ఎస్ ప్రభుత్వం చివరి ఆయకట్టు వరకూ నీరందించిందని, ప్రస్తుత యాసంగిలో కూడా ప్రతి ఎకరాకూ నీరందించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండల పరిధిలోని ఖానాపూర్ (కే)లో విలేకరులతో మాట్లాడారు. యాసంగిలో 4వేల ఎకరాలకు మాత్రమే నీరందిస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని, ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటితో 6,200 ఎకరాలకు సాగు నీరందించవచ్చన్నారు. బీఆర్ఎస్ హయాంలో కుడి, ఎడమ, ఎమర్జెన్సీ కాల్వల కింద వానకాలం, యాసంగి డీ సిల్టింగ్ తీయించి రెండూ పంటలకూ సాగునీందించామని తెలిపారు. కాల్వల ప్రస్తుత దుస్థితిలో సాగునీరు పంట పొలాలకు పారడం కష్టమేనన్నారు. నీరు వదలక ముందు కాల్వల్లోని పూడికను తొలిగించాలని ఆయన సూచించారు. వానకాలం, యాసంగికి సంబంధించి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన సన్న, దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బసవేశ్వర లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టును మాజీ సీఎం కేసీఆర్ ప్రారంభించారని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణఖేడ్ ప్రాంతాన్ని ఎడారిగా మార్చేందుకు బసవేశ్వర లిఫ్టు ఇరిగేషన్ పనులను నిలిపివేసిందని ఆరోపించారు. నల్లపోచమ్మ లిఫ్టు ఇరిగేషన్ గతంలోనే ప్రారంభించారని, తిరిగి రూ.కోట్లతో ప్రారంభించడం కాంగ్రెస్ నాయకులకు కల్పతరువుగా మారిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తరుగు 2 కిలోలు తీస్తే దోపిడీ చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారని, ఇప్పుడూ తరుగు 2 కిలోలు తీస్తున్నారు కాదా మీరు దోపిడీ చేస్తున్నారా అంటూ ఎద్దేవా చేశారు. క్రాప్ హాలిడే ఇచ్చి కాల్వల నిర్మాణం పనులు సగం పూర్తి చేశారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయతో చెరువులను గంగాళంలా మార్చడంతో గొలుసుకట్టు కాల్వలతో పంట పొలాలకు నీరు అందించడంలో నియోజకవర్గంలో పంటలు సమృద్ధిగా పండాయని పేర్కొన్నారు. కక్ష సాధింపు చర్యలతో కల్హేర్, మార్డి గ్రామాల్లోని పీఏసీఎస్‌లకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మంజూరు చేయలేదని విమర్శించారు. వర్షాభావ పరిస్థితుల్లో చెరువులు, బోరుబావుల కింద పూర్తిస్థాయిలో సాగు కాలేదని, సాగు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. చాలామంది రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని రైస్ మిల్లులకు అమ్ముకున్నారని స్పష్టం చేశారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, ఇకనైనా రైతు భరోసా అందించి రూ. 2 లక్షలు వరకు పంట రుణ మాఫీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మండల అధ్యక్షుడు రాంసింగ్, జడ్పీ, మండల కోఆప్షన్ మెంబర్లు అలీ, ఘనీ, కల్హేర్, మార్డి పీఏసీఎస్ చైర్మన్లు గంగారెడ్డి, వెంకట్, మాజీ ఎంపీటీసీ సంగప్ప, మాజీ బీసీసెల్ అధ్యక్షుడు సాయిగొండ, నాయకులు జనార్దన్ సార్, రాములునాయక్, సంగయ్య, నర్సింహులు, విఠల్, గోపాల్‌రెడ్డి, నర్సింహ గౌడ్, మోహన్ సాగర్, నాగ్‌నాథ్, పీరయ్య, మంద నారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, పండరి, సంగమేశ్వర్, మాణిక్‌ప్రభు, అంజిగొండ, సాయిరాం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేపపిల్లలు అందజేయాలి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట ఊబచెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, నవంబర్ 23: చెరువులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులకు అన్ని రకాల చేప పిల్లలను సకాలంలో అందజేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలోని ఊబచెరువులో ఎమ్మెల్యే చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..బీఆర్ఎస్ హయాంలో మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసి, వారికి చేతినిండా పని కల్పించామని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అందులో 50శాతం కూడా చేప పిల్లల పంపిణీకి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో ఈ ఏడాది పది చెరువులకు మాత్రమే చేప పిల్లలు పంపిణీ చేస్తున్నారని, 40 సొసైటీలకు 2216 మంది లబ్ధి పొందుతున్నారన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రస్తుతం కేటాయించిన దాని కంటే రెట్టింపు ఉండేదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బంది పడే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వృత్తిపై ఆధారపడే మత్స్యకారుల ఉపాధిపై దెబ్బకొట్టే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు శివరాజ్ పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు సాతాని శ్రీశైలం, ఇంద్ర మోహన్ గౌడ్, నాయకులు ముబీన్, నసీర్, మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు చాపల హనుమంతు, నల్ల సుధాకర్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన

కోహెడ, నవంబర్ 23: సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్‌లో తాగునీటి కోసం మహిళలు నిరసన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా గ్రామంలో తాగునీరు లేక అవస్థలు పడుతున్నామన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శి లేక పోవడం, ఇన్‌చార్జి కార్యదర్శితో ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. చలికాలంలో కూడా తాగునీటి సమస్య ఏందని, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇన్‌చార్జి కార్యదర్శి మహిళలను సముదాయించి, సమస్యను జిల్లా అధికారులకు వివరించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.

కోహెడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

విజయోత్సవాలను అడ్డుకున్న రైతులు

కళాబృందం సభ్యులతో వాగ్వాదానికి దిగిన పుల్కల్ రైతులు

పుల్కల్, నవంబర్ 23: కాంగ్రెస్ విజయోత్సవాలను రైతులు అడ్డుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా విజయోత్సవాలను ప్రారంభించింది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలుపై గ్రామ గ్రామాన ప్రచార రథాన్ని ఏర్పాటు చేసింది. అందులోభాగంగా శనివారం వివిధ పథకాలను ప్రజలకు తెలిపేందుకు కళాబృందం సభ్యులతో కూడిన వాహనం సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రానికి వచ్చింది. ప్రభుత్వ పథకాల అమలుపై కళాకారులు ప్రజలకు వివరించేందుకు సిద్ధమయ్యారు. ఆరు గ్యారంటీల్లో ఏ ఒక్కటైనా సక్రమంగా నెరవేర్చారా, ఇంతవరకు పంట రుణమాఫీకే దిక్కులేదు, మీరు మా గ్రామంలో ఏం ఒరగ బెడదామని వచ్చారని రైతులు కళాబృందం సభ్యులను నిలదీశారు. మీరు ఒద్దూ... మీ పథకాలు వద్దూ అంటూ అడ్డుకున్నారు. మా గ్రామం నుంచి వెళ్లిపోవాలంటూ హుకుం జారీ చేయడంతో చేసేదేమి లేక కళాకారులు వాహనాన్ని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

- సిద్దిపేట, మెదక్ కలెక్టర్లు మనుచౌదరి, రాహుల్‌రాజ్

నాణ్యమైన భోజనం అందించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్/మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 23: సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ, గురుకులాలు, మోడల్, కేజీబీవీ స్కూళ్లు, ప్రభుత్వ దవాఖానల్లో నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని సిద్దిపేట, మెదక్ కలెక్టర్లు మనుచౌదరి, రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరాల్లో జిల్లాల్లోని విద్య, సోషల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్, సివిల్ సప్లై, వైద్యారోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఆహారం అందించే ప్రతి విద్యాసంస్థల్లో నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని మాత్రమే అందించేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకశాతం క్వాలిటీ కూడా తగ్గకూడదని తెలిపారు. దీనికోసం జిల్లా స్థాయి ఫుడ్ సేఫ్టీ కమిటీ వేస్తున్నామని, ఈ కమిటీ అదనపు కలెక్టర్ ఆధీనంలో పనిచేస్తుందని తెలిపారు. అన్ని విద్యాసంస్థల్లో ముఖ్యంగా సరుకులు, బియ్యం, పప్పులు, నూనెలు, ఇతర వంట సరుకులన్నీ నాణ్యమైనవి మాత్రమే తీసుకోవాలని, బియ్యంలో ఎలాంటి పురుగులు వచ్చినా, కాలం చెల్లిన సరుకులను సైతం రిటర్న్ చేసేలా రిజిస్టర్ మెయింటేన్ చేయాలన్నారు. బియ్యం, వంట సరుకులు భద్రపరిచే గదుల్లో ఎలుకలు, బొద్దింకలు, క్రిమికీటకాలు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భోజన సిబ్బంది రుచికరంగా వండే విధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యాసంస్థల్లో ఆహారం తయారు కాగానే టెస్టింగ్ అధికారిని నియమించాలన్నారు. కిచెన్ షెడ్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి విద్యాసంస్థల్లో భోజన మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. అంగన్‌వాడీల్లో సైతం నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. విద్యాసంస్థల్లో పిల్లలు వ్యాధుల బారిన పడకుండా తరచూ క్యాంప్‌లు నిర్వహించి వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకొని మందులు అందించాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు తెలిపారు. జిల్లాలో ఎక్కడా ఆహారం బాగాలేదని, పిల్లలు అస్వస్థతకు గురయ్యారని, ఏ చిన్న వార్త వచ్చినా అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యాసంస్థల్లో ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని, ఒక్కొక్కటిగా ప్రాధాన్యత మేరకు పరిష్కరిస్తామని కలెక్టర్లు మనుచౌదరి, రాహుల్‌రాజ్ హామీనిఇచ్చారు. సమావేశంలో సిద్దిపేట, మెదక్ అదనపు కలెక్టర్లు అబ్దుల్ హమీద్, మెంచు నగేష్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి 30 ఎగ్జిబిట్లు ఎంపిక

అవార్డులు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 23: మూడు రోజులుగా సేయింట్ ఆంథోనీస్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన శనివారం ముగిసింది. జిల్లావ్యాప్తంగా 706 ఎగ్జిబిట్లు ఈ ప్రదర్శనలో పాల్గొనగా, 30 ఎగ్జిబిట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నాయి. ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ కమ్ కాంపిటీషన్స్ విభాగంలో 89 ప్రాజెక్టులు పాల్గొనగా, 9 ప్రదర్శనలను ఉత్తమ ఎగ్జిబిట్లుగా ఎంపిక చేశారు. ఆయా ఎగ్జిబిట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నాయి. జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హాజరై ఉత్తమ ఎగ్జిబిట్లు ప్రదర్శించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, సేయింట్ ఆంథోనీస్ పాఠశాల కరెస్పాండెంట్ సలోమాన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, ఎంఈవో, వివిధ కమిటీల కన్వీనర్లు, విద్యాసాగర్, జాకీర్ హుస్సేన్, విద్యార్థులు, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు సజావుగా జరగాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి, పక్కన కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 23: సంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. శనివారం జిల్లాలో పర్యటించిన ఆయన రానున్న ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశారు. సంగారెడ్డి, అందోల్ ఆర్డీవో కార్యాలయాలను సందర్శించి ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎస్ఎస్ఆర్-2025 ఓటరు నమోదు వివరాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్